# సౌందర్య రహస్యం

(గల్పిక)

ప్రకాశం పెద్ద సంపాదనగలవాడు కాడు. కాని అతని ఇల్లు—అద్దె ఇల్లే గొప్ప ఆర్టు డైరెక్టరు తీర్చిదిద్దినట్టుంటుంది. మేమందరమూ అతని భార్యను మెచ్చుకుని, "ఇల్లు ఇలా పెట్టినందుకు ఎన్ని వందలైనా ఇయ్యొచ్చు ! భార్య గనక జీతంలేని చాకిరీ చేస్తున్నది," అనేవాళ్లం.

ప్రకాశం మాతో ఏకీభవించేవాడు.

"జీవితం అందంగా ఉండాలి. ఎంత పేదవాళ్లయినా జీవితాన్ని అందంగా చేసుకోవచ్చు. మన దరిద్ర నారాయణులకు ఆ విద్య తెలిసిననాడు విప్లవం వచ్చినట్టే!" అనేవాడు ప్రకాశం.

మరి అలాటివాడు అంత అందవికారమైన పనిమనిషిని - ధనలక్ష్మిని— ఎందుకు పెట్టుకున్నాడో మాకు తెలిసేది కాదు. ప్రకాశం ఇంట్లో వికారమైన దినుసు ఏదన్నా ఉంటే అది ధనలక్ష్మి. బహుశా చౌకగా వచ్చిందని పెట్టుకుని ఉంటాడు. దానిజీతం నెలకు పదిహేను రూపాయలు - అయిదురోజులపాటు చౌక పారు తిండి తినటానికి చాలుతుంది. నెలకు మిగిలిన ఇరవై ఐదురోజులూ ఏం తింటుందో మన కెందుకు ?

ఇంతలో ఒకరోజు నేను ప్రకాశం ఇంటికి వెళ్ళేసరికి ఇల్లు ధర్మసత్రం చావడిలాగా ఉంది. నేల ఊడ్చినట్టు లేదు. ఒక మూల మురికిగుడ్డలు కుప్పగా ఉన్నాయి. వంట ఇంటిపక్కన డాబాలో రెండు డజన్ల ఎంగిలి కంచాలూ, అంట్లపాత్రలూ, గరిటెలూ, సబ్బులూ, కడగని గ్లాసులూ ఉన్నాయి.

"ఏమిటోయ్ ఇది ప్రకాశం ?" అన్నాను

"పనిచేసే పక్షి నిన్నటినంచీ రావటంలేదు. దాని మొగుణ్ణి ఆస్పత్రిలో చేర్చారట !" అన్నాడు ప్రకాశం చిరాకుగా.

***కొడవటిగంటి కుటుంబరావు***